## ప్రాజెక్టులకు భారీ వరద

**సాగర్ 26, మూసీ 7 గేట్ల ద్వారా నీటి విడుదల**

నందికొండ/కేతేపల్లి : భారీ వర్షాలు కురుస్తుండడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండాయి. నాగార్జునసాగర్ డ్యామ్‌కు పై నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 4,68,595 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. మూసీ ప్రాజెక్టుకు సోమవారం ఉదయం 15,783 క్యూసెక్కుల ఉండగా సాయంత్రానికి 7,549 క్యూసెక్కులకు తగ్గింది. ఉదయం నుంచి ప్రాజెక్టు 7 క్రస్టు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



మూసీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు



చింతలకుంట తండా పాఠశాలలో సొంతంగా వండుకొని తింటున్న వరద బాధితులు

## ఒక్క పూట భోజనం పెట్టే దిక్కులేదు

**ఇదీ పునరావాస కేంద్రంలో పరిస్థితి**

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలం చింతలకుంట తండాలో భారీ వర్షాలకు 8 ఇండ్ల పైకప్పులు కూలాయి. ఆయా కుటుంబాలు సర్వం కోల్పోవడంతో అధికారులు స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయం కల్పించారు. ఆ తర్వాత అటువైపు చూసినవారే లేరు. కనీసం భోజన వసతి కూడా కల్పించకపోవడంతో బాధితులు తిరిగి తమ ఇండ్ల నుంచే గ్యాస్ సిలిండర్లు, స్టవ్ తెచ్చుకుని వంట చేసుకున్నారు. మాజీ సర్పంచ్ రవినాయక్ తాగు నీటి సౌకర్యం కల్పించారు. సోమవారం పాఠశాలకు సెలవు ఉండడంతో ఇబ్బంది లేదు. మంగళవారం పాఠశాల తెరిస్తే తమ పరిస్థితి ఏంటని బాధితులు ఆవేదన చెందుతున్నారు. పునరావాస కేంద్రంలో వదిలేసిన ప్రభుత్వం ఒక్క పూట భోజనం కూడా అందించలేకపోడం బాధగా ఉందని వాపోయారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా.. మంగళవారం వాన పడితే 4 కుటుంబాలను గ్రామపంచాయతీ భవనానికి తరలించి, మిగిలిన వారిని స్కూల్‌లోనే సర్దుతామని చెప్పుకొచ్చారు.

# కదిలిస్తే కన్నీళ్లే...

## వరద బాధిత ప్రాంతాల్లో అలివికాని అవస్థలు

- సర్వం కోల్పోయి ధైర్యంచెడ్డ బాధితులు
- తక్షణ సాయం కోసం ఎదురుచూపులు
- చాలా గ్రామాలకు ఇప్పటివరకు అధికారులు వెళ్లిందే లేదు..
- పునారావాస కేంద్రాల్లోనూ పట్టించుకునేవారు కరువు
- నష్టం ప్రాథమిక అంచనాకు వాస్తవ పరిస్థితికి భారీ తేడా
- వరద ప్రాంతాల్లో పర్యటించి ధైర్యమిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మేళ్లచెర్వు మండలం కందిబండ శివారులో కూలిన వంతెన

సూర్యాపేట, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ఆస్నా తుఫాన్ కారణంగా జరిగిన వరద విలయానికి సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలు ఎక్కువ దెబ్బతిన్నాయి. పంటలు నేలమట్టమైన రైతులు, సర్వం కోల్పోయిన ప్రజలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఆదివారం తమ నియోకవర్గాలకు రాని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెండోరోజు సోమవారం వచ్చారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ మాత్రం రెండ్రోజుల నుంచి వరద ప్రాంతాల్లో తిరుగుతూ బాధితులకు ధైర్యం చెప్తున్నారు. ప్రభుత్వం తరపున సాయం అందే వరకు వదిలే ప్రసక్తే లేదని భరోసా కల్పిస్తున్నారు. కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల్లోని 70 శాతం ప్రాంతాల్లోని ఇండ్లను వరద నీరు ముంచెత్తింది. నిత్యావసర సరుకులన్నీ నీటి పాలయ్యాయి. తినడానికి తిండి కూడా లేకుండాపోయిందని నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురంలో బాధితులు స్థానిక ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు. చాలా చోట్ల ఇదే పరిస్థితి. అధికారులు ఎవరు వెళ్లినా చేతులు జోడించి వేడుకుంటున్నారు. జిల్లాలో 21 చెరువుల తోపాటు నాగార్జునసాగర్, మూసీ కాల్వలు తెగడంతో వేల ఎకరాల్లో ఇసుక, మట్టి మేటలు కనిపిస్తున్నాయి. 44 ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. 7 ఇండ్లు పూర్తిగా కూలాయి. కోదాడలో వరద తాకిడికి ఇద్దరు చనిపోయారు. 7 పశువులు మృత్యువాతపడ్డాయి. 750 విద్యుత్ స్తంభాలు, 150 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.



కోదాడ రూరల్ : తొగర్రాయిలో కూలిన ఇల్లు

### నల్లగొండ జిల్లాలో 27 మండలాల్లో కురిసిన వాన

నీలగిరి : నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు జిల్లాలో 6.6 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నార్కట్‌పల్లిలో 29.9, మిల్లీమీటర్లు, కట్టంగూర్‌లో 19.9, శాలిగౌరారంలో 18.4, చిట్యాలలో 16.9, మునుగోడులో 16.3, మాడ్గులపల్లిలో 15.1, వేములపల్లిలో 14.8, చండూరులో 13.6, నల్లగొండలో 13.2, నకిరేకల్‌లో 12.1, కేతేపల్లిలో 8.5, తిప్పర్తిలో 8.1, గుండ్లపల్లిలో 6.2, కనగల్‌లో 5.5, మర్రిగూడలో 3.0, దేవరకొండలో 1.6, నాంపల్లిలో 1.5, మిర్యాలగూడలో 1.2, చింతపల్లిలో 0.9, త్రిపురారంలో 0.8, గట్టుప్పల్‌లో 0.8, చందంపేటలో 0.7, గుర్రంపోడ్‌లో 0.6, దామరచర్లలో 0.5, నేరేడుగొమ్ములో 0.5, కొండమల్లేపల్లిలో 0.3, అనుములో 0.1 వర్షపాతం నమోదైంది.

### ఇంటిల్లిపాది రోడ్డున పడ్డం



భారీ వానకు మా ఇల్లు కుప్పకూలింది. బియ్యం, పప్పు, ఉప్పుతోపాటు వస్తువులన్నీ వరద పాలైనయి. ఇంటిల్లిపాది రోడ్డున పడి దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. కూలీనాలి చేసుకొని బతికేటోళ్లం. మళ్లీ ఇల్లు కట్టుకునే తాహతు లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

**–షేక్ కరీమా, మాతానగర్, కోదాడ**



కోదాడలోని మాతానగర్‌లో కూలిన కరీమా ఇల్లు

### మా ఊరి మొహం చూసిన అధికారి లేరు



భారీ వర్షాలతో ఊళ్లో చాలా ఇండ్లలోకి నీరు చేరాయి. నిత్యావసర సరుకులు కొట్టుకుపోయి అనేకమంది అల్లాడుతున్నారు. కరెంట్ స్తంభాలు కూలాయి. పంటలు నేలకు పడ్డాయి. రైతుల మోటార్లు వరదలో కొట్టుకుపోయాయి. ఎమ్మెల్యే వచ్చే వరకూ ఒక్క అధికారి అయినా వచ్చిన పాపన పోలేదు. ఇప్పటికైనా గ్రామంలో పర్యటించి నష్టం అంచనా వేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి.

**-శెట్టి సురేశ్‌నాయుడు, కూచిపూడి మాజీ సర్పంచ్, కోదాడ మండలం**



కోదాడ : గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న గుడిసె కూలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో కొత్తపల్లి ముత్తయ్య దంపతులు



గుర్రంపోడు మండలం మక్కపల్లిలో మిర్చి పంట వేసిన పొలంలో ఇసుక మేట

## రైతన్న వెన్ను విరిచిన వరద

### నల్లగొండ జిల్లాలో 648 ఎకరాల్లో పంట నష్టం

- సూర్యాపేట జిల్లాలో 19,696 ఎకరాలు..
- ఇంతకు రెట్టింపు స్థాయిలో వాస్తవ అంచనాలు
- త్వరలో పూర్తిస్థాయి నష్ట నివేదిక : కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లాలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. పొలాల మీదుగా వరద పొంగి పొర్లడంతో పంటలు మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి చేలల్లో నీళ్లు నిలువడం వల్ల పంట పండు మరింత దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. వరి పైర్లు ఇప్పటికే కుళ్లిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో వాస్తవ అంచనాలు తీస్తే పంటల నష్టం భారీగా ఉండనుంది. గత రెండ్రోజుల నష్టానికి సంబంధించి జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా రూపొందించింది. మొత్తం పొలంలో 33 శాతం కంటే ఎక్కువ దెబ్బతింటేనే అధికారులు పరిగణలోకి తీసుకుని అంచనాలు వేశారు. ఆ మేరకు నల్లగొండ జిల్లాలో ఆరు మండలాల్లోని 14 గ్రామాల పరిధిలో వరి, పత్తి, మిర్చి పైర్లు దెబ్బతిన్నాయి. 455 మంది రైతులకు సంబంధించిన 648 ఎకరాల పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇందులో 377 మంది రైతులకు సంబంధించిన 555 ఎకరాల్లో వరి , 75 మంది రైతులకు చెందిన 90 ఎకరాల పత్తి, ముగ్గురు రైతులది మూడెకరాల మిర్చి పంటకు నష్టం వాటిల్లినట్లు సోమవారం వెల్లడించారు. దామరచర్ల మండలం వాడపల్లిలో 100 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో పత్తి, మాడ్గులపల్లి మండలం కల్వలపాలెంలో రెండెకరాల్లో వరి, వేములపల్లి మండలంలో మొత్తం వరి పంటే దెబ్బతింది. ఇటిక్యాలలో 45 ఎకరాలు, మునగపహాడ్‌లో 58, శెట్టిపాలెంలో 47, ఆమనగల్‌లో 95, చలిచీమలపాలెంలో 35, రావులపెంటలో 40, తిమ్మారెడ్డిగూడెంలో 20, వేములపల్లిలో 30, సల్కనూర్‌లో 50 ఎకరాల్లో నష్టం జరిగింది. గుర్రంపోడు మండలంలోని పార్లపల్లిలో మూడెకరాల్లో మిర్చి, పెద్దవూర మండలం చలకుర్తిలో మూడెకరాల్లో వరి, చందంపేట మండలం తెల్దేవర్‌పల్లిలో 30 ఎకరాల్లో వరి, 70 ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాల్లో పేర్కొన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి అంచనాలు రూపొందించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. రహదారులకు జరిగిన నష్టంపైన పంచాయతీరాజ్ విభాగం అంచనాలు వేస్తున్నది. ఇప్పటివరకు ఆరు రోడ్లు దెబ్బతిన్నట్లుగా రూ.1.07 కోట్ల నష్టం జరిగినట్లుగా పేర్కొంది. నల్లగొండ నుంచి ఖాజీరామారం, చిన్నాయిగూడెం–కాశివారిగూడెం, కల్వలపాలెం–సల్కనూర్, ఇందిరమ్మకాలనీ–భోజ్యానాయక్‌తండా, తక్కెళ్లపాడు–పాలేరువాగు వరకు పీఆర్ రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ట్రాన్స్‌కో విభాగానికి సంబంధించిన లక్ష రూపాయల వరకు కరెంటు స్తంభాలకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలు కూడా నష్టం అంచనాలు వేసే పనిలో ఉన్నాయి. త్వరలో వివిధ విభాగాల వారీగా పూర్తి స్థాయి అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు.

**సూర్యాపేట జిల్లాలో...**

సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 16 మండలాల పరిధిలో 19,696 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. అత్యధికంగా వరి 14,120 ఎకరాల్లో ఉంది. పత్తికి 5,576 ఎకరాల్లో నష్టం జరిగింది అధికారులు నివేదికలో పేర్కొన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజవర్గాల్లో నష్టం అత్యధికంగా ఉంది. కోదాడ నియోజవర్గంలో 13,476 ఎకరాలు, హుజూర్‌నగర్ నియోజవర్గంలో 4,770 ఎకరాలు, సూర్యాపేట నియోజకవర్గంలో 1,450 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. తుంగతుర్తి నియోజకవర్గంలో పంట నష్టం లేదని చెబుతున్నారు. వరద తీవ్రత ఇంకా ఉన్నందున రెండ్రోజుల్లో పూర్తి స్థాయిలో నష్టం వివరాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



అనంతగిరి : గోండ్రియాలలో వరద బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

## వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**బాధితులకు అండగా బీఆర్ఎస్**

- మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్
- వరద ప్రాంతాల్లో పర్యటన

అనంతగిరి, నడిగూడెం, సెప్టెంబరు 2 : భారీ వరదల కారణంగా నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కోదాడ మాజీ బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. అనంతగిరి మండలం గోండ్రియాల, నడిగూడెం మండలంలోని రామచంద్రాపురంలో సోమవారం వారు పర్యటించారు. ముంపు గ్రామ ప్రజలతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు. పాలేరు వాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వరద బాధితులకు పూర్తిస్థాయిలో అండగా ఉండాలని కోరారు. ప్రభుత్వం పునరావాస చర్యలను ముమ్మరం చేయాలన్నారు. రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు గండూరి సంతోశ్, బోసు, వీరయ్య, హరీశ్ ఉన్నారు.

# వరద నష్టంపై సీఎం సమీక్ష

- మృతుల కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా
- తక్షణ సాయంగా సూర్యాపేట కలెక్టర్ ఖాతాకు రూ.5కోట్లు



మోతెలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి, సామేల్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : తుఫాన్ కారణంగా వచ్చిన వరదల్లో సర్వం కోల్పోయిన వారికి సాయం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వరద ప్రాంతాలను పరిశీలించేందుకు సోమవారం ఖమ్మం జిల్లాకు వెళ్తున్న ఆయన మోతె మండల కేంద్రంలో ఆగారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి సమీక్ష నిర్వహించారు. వరద నష్టానికి సంబంధించిన ఫొటోలను పరిశీలించి పంట, ఆస్తి నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమీక్షలో సీఎం సూర్యాపేట జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదవగా.. కోదాడ, హుజూర్‌నగర్‌లో తీరని నష్టం జరిగినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చెప్పారని, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. వరదల్లో చిక్కుకొని చనిపోయిన వారి కుటుంబానికి రూ.5లక్షలు, మృతిచెందిన పశువులకు రూ.50వేలు, గొర్రెలు, మేకలకు 5వేలు, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారు. తక్షణ సాయంగా కలెక్టర్ ఖాతాకు రూ.5కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో బాధపడుతున్న ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. అధికారులు అద్భుతంగా పని చేస్తున్నారని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులతోపాటు ఇండ్లు కోల్పోయిన వారికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని అన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే రూ.23 కోట్లతో మరమ్మతులు చేయిస్తానన్నారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ రణప్రీత్‌సింగ్, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మొక్కుబడిగా..!

- అత్యధిక నష్టం ఇక్కడే జరిగినా వరద ప్రాంతాలకు సీఎం వెళ్లకపోవడంపై విమర్శలు

రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో నమోదు కాగా.. భీకరమైన వరదలతో అతలాకుతలమైన కోదాడకు పక్క నుంచే ఖమ్మంలో వరద ప్రాంతాలను పరిశీలించేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కోదాడలో పర్యటించేందుకు మనస్సు రాలేదా, లేక సమయం లేదా? ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఖమ్మం మార్గమధ్యంలో ఉన్నందునే జిల్లాలో జరిగిన వరద నష్టంపై రోడ్డు పక్కన ఉన్న ఫంక్షన్ హాల్‌లో సమీక్ష చేశారని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సూర్యాపేట నుంచి కేవలం 45 కిలోమీటర్లు వెళ్తే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి ప్రాతినిధ్యం వహిస్తున్న కోదాడ, అక్కడి నుంచి మరో 15 కిలోమీటర్లు వెళ్తే మంత్రి ఉత్తమ్ ప్రాతినిధ్యం వహించే హుజూర్‌నగర్ ఉండగా.. ఇక్కడ వరద నష్టాన్ని పరిశీలించేందుకు సీఎం రాకపోవడంపై కాంగ్రెస్ శ్రేణులు కూడా ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

## బీసీ కుల గణన చేపట్టాలి

- రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీని అమలు చేయాలి
- కలెక్టరేట్ ఎదుట బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

నీలగిరి, సెప్టెంబర్ 2 : బీసీ సమగ్ర కుల గణన చేపట్టి 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడుతూ బీసీ కుల గణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టారని, అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా కాలం వెల్లదీస్తూ వస్తున్నారని అన్నారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు స్థానిక ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టాలని ఆదేశించడం సరి కాదని తెలిపారు. బీసీలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నల్లా సోమమల్లయ్య, కేశబోయిన శంకర్, కాశయ్య, సీతారాములు, కోటప్ప, చొల్లేటి రమేశ్, మధు యాదవ్, అమరోజు గీత, బంటు కవిత పాల్గొన్నారు.